సాక్షి
అనంతపురం
సోమవారం । 13 । మే । 2024



పరిశ్రమలకు ఊతం
గత నాలుగేళ్లలో జిల్లాలో భారీగా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాయి. 8లో



స్టాఫ్‌నర్సుల సేవలు భేష్
స్టాఫ్ నర్సుల సేవలు అనన్యసామాన్యమని జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆత్మారాం అన్నారు. 8లో



జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

జిల్లా వివరాలిలా..

ఓటర్లు	20,18,162
పురుష ఓటర్లు	9,97,792
మహిళా ఓటర్లు	10,20,124
థర్డ్ జెండర్ ఓటర్లు	246
పోలింగ్ అధికారులు (పీఓ)	2,472
సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓ)	2,552
ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ)	10,208
సూక్ష్మ పరిశీలకులు	544
సెక్టోరియల్ అధికారులు	522
బందోబస్తు విధుల్లో ఉండే పోలీసులు	దాదాపు 4,000
జిల్లాలో పోలింగ్ కేంద్రాలు	2,236
వెబ్‌కాస్టింగ్	2,236
క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు	1,032
వీడియోగ్రాఫర్లు	546
ఈవీఎంలు	
బ్యాలెట్ యూనిట్లు (బీయూ)	8,324
కంట్రోల్ యూనిట్లు (సీయూ)	5,074
వీవీప్యాట్లు	6,188

ఓటేద్దాం రండి

- ప్రజలకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు

అనంతపురం అర్బన్: 'ప్రజాస్వామ్యంలో ఎన్నికలు పెద్ద పండుగ. ఈ వేడుకలో మనమందరం పాల్గొని ఓటు వేద్దాం. తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకుని మన బాధ్యతను నిర్వర్తిద్దాం' అంటూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరూ కదలివచ్చి ఓటు వేయాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున వీలైనంత త్వరగా ఓటేసేలా చూసుకోవాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించరని, ఎవరూ వెంట తెచ్చుకోవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట వీడియో చిత్రీకరణ ఉంటుందని, ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వెబ్‌కాస్టింగ్‌లో నమోదవుతుందని చెప్పారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనంతపురంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి సరి చూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది





ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న ఉద్యోగిని

ఓటుకు వేళాయె..

- నేడే పోలింగ్
- కేంద్రాలకు చేరిన ఈవీఎంలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రక్రియ
- అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పటిష్ట బందోబస్తు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమరంలో ముఖ్య ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకూ సాగనుంది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 21 మంది అభ్యర్థులు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాలకు 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికే ఈవీఎంలు చేరాయి.

పటిష్ట బందోబస్తు..

పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఎన్నికల బందోబస్తుకు 11 కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయి. 16 వేల మంది సిబ్బంది పోలింగ్ విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 4 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ విధుల్లో ఉండే 22,274 మంది ఉద్యోగులు, పోలీసు సిబ్బంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సెల్‌ఫోన్‌కు నో..

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకుని వెళ్లిపోవాలి. గుంపులుగా కేంద్రాల వద్ద ఉండకూడదు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతించరు.



ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఆదేశాలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్

అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్..

జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించిన 1,032 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టారు. వీటిలో వెబ్‌కాస్టింగ్ మరింత పక్కాగా నిర్వహిస్తారు. ఆయా కేంద్రాల వద్ద కేంద్ర పారామిలటరీ బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయి. అంతే కాకుండా ఈ కేంద్రాల పర్యవేక్షణ కోసం 544 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు.

ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్

పోలింగ్ ప్రారంభానికి ముందు ప్రిసైడింగ్ అధికారులు ఉదయం 5.30 గంటలకు రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహిస్తారు. వేసిన గుర్తుకే ఓటు పడుతోందా..? వీవీప్యాట్‌లో అదే గుర్తు చూపిస్తోందా..? అనేది రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వయంగా పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లయితే సంతృప్తి వ్యక్తం చేస్తూ వారు సంతకాలు చేస్తారు. అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రిసైడింగ్ అధికారి ప్రారంభిస్తారు.

సజావుగా ఎన్నికల సామగ్రి పంపిణీ

పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం సజావుగా నిర్వహించారు. అనంతపురం అర్బన్, శింగనమల, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను అనంతపురం నగరంలో ఏర్పాటు చేశారు. రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లోనే ఏర్పాటు చేశారు. కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్, ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్ సందర్శించారు. ఏర్పాట్లు, సామగ్రి పంపిణీలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ, ఇతర ఏర్పాట్లను అనంతపురం, రాప్తాడు, శింగనమల రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, వసంత బాబు, వెన్నెల శ్రీను పర్యవేక్షించారు.

గుమిగూడొద్దు.. ప్రలోభ పెట్టొద్దు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరగనున్న రోజున ప్రవర్తన నియమావళిని ఎన్నికల కమిషన్ స్పష్టంగా తెలియజేసింది. రాజకీయ పక్షాలు, అభ్యర్థులు పోలింగ్ రోజున, పోలింగ్ బూత్ వద్ద పాటించాల్సిన నియమాలను భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించింది.


- ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తి స్వేచ్ఛతో వినియోగించుకోవటానికి, ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు అభ్యర్థులు సహకరించాలి.
- తమ పార్టీ కార్యకర్తలకు తగిన బ్యాడ్జీలు లేదా గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- ఓటర్లకు ఇచ్చే గుర్తింపు స్లిప్‌పై అభ్యర్థి పేరు లేదా పార్టీ పేరు ఉండకుండా చూసుకోవాలి.
- అభ్యర్థి, పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరుల మధ్య కొట్లాటలు, ఆవేశాలకు గురిచేసేలా పోలింగ్ బూత్‌ల ముందు, తాము నిర్వహించే శిబిరాల వద్ద అనవసరంగా జనం గుమిగూడకుండా చూసుకోవాలి.
- అభ్యర్థి తన శిబిరం చాలా నిరాడంబరంగా ఉండేలా చూసుకోవాలి. శిబిరంలో ఎలాంటి పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు, ప్రచార వస్తువులను ప్రదర్శించకూడదు. ఆహార పదార్థాలను శిబిరం వద్ద అందించకూడదు. గుంపులను అనుమతించకూడదు.
- పోలింగ్ రోజున తాము ప్రయాణించే వాహనాలపై కమిషన్ విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండేలా పత్రాలు ఉండాలి. వాటి కోసం అనుమతులు పొందాలి. ఆ అనుమతులు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.

పోలింగ్ స్టేషన్ల వద్ద

ఓటర్లు తప్ప మరెవరూ ఎన్నికల సంఘం నుంచి తగిన పాసు లేకుండా పోలింగ్ స్టేషన్లలోకి ప్రవేశించరాదు.

- పోలింగ్ బూత్ వద్ద ఉన్న ఓటర్లను ఏ విధంగానూ ప్రలోభ పెట్టకూడదు. ఓటర్లకు డబ్బు ఇవ్వడం, బెదిరించడం వంటివి చేయడం నియమావళిని ఉల్లంఘించడమే.
- రాజకీయ పక్షాలు ఎంపిక చేసి అనుమతి పొందిన పోలింగ్ ఏజెంట్లను మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తారు. ఒకరి గుర్తింపు కార్డును మరొకరికి ఇచ్చి బూత్‌లోకి పంపకూడదు.
- ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదు లేదా సమస్య ఉన్నా వాటిని ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకుల దృష్టికి అభ్యర్థులు, పార్టీ పోలింగ్ ఏజెంట్లు తీసుకురావాల్సి ఉంటుంది.

ఆలోచించు.. మంచికి ఓటెత్తు



ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ప్రతి పౌరుడూ తన అంతరంగంలో ప్రజాస్వామిక సంస్కారాన్ని అలవర్చుకోవాలి. ప్రజాస్వామ్య సంస్కారం బయట ఎక్కడి నుంచో వచ్చింది కాదు. మనలో నుంచి, మన మనసులో నుంచి వచ్చిందే. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే పౌరులు తమ బాధ్యత తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.
– మహాత్మాగాంధీ



సాక్షి, అనంతపురం: మహాత్ముడు చెప్పినట్లు రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత పాదుగొల్పాలంటే నీ ఓటే కీలకం. ఈ వజ్రాయుధాన్ని నీవు సంధించే తీరును బట్టే నీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. గతాన్ని గుర్తు చేసుకుని, వర్తమానాన్ని బేరీజు వేసుకుని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటేయకపోతే..తద్వారా కలిగే నష్టాన్ని భరించాల్సింది నీవే. కేవలం నీ గురించే కాదు.. పిల్లలు, పెద్దల శ్రేయస్సునూ దృష్టిలో ఉంచుకోవాలి. నీ ఊరు, జిల్లా ప్రగతిని కాంక్షించాలి. అంధకారం నుంచి వెలుగులోకి తెచ్చిన పాలకుడిని గౌరవించాలి. మరింత వెలుగులు నింపాలన్న సంకల్పం, విశ్వసనీయత కల్గిన నేతకు పట్టం కట్టాలి.

దుర్భరం నుంచి సస్యశ్యామలం

ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీక. మంచిని గౌరవించి, చెడును ఖండించడంలో జిల్లా వాసులు ఎప్పుడూ ముందుంటారు. ఐదేళ్ల క్రితం జిల్లా అంతటా తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. పంటలు పండక, పనుల్లేక రైతులు, ప్రజలు నరకయాతన అనుభవించారు. పొట్టచేతబట్టుకుని ముంబై, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లిన అనుభవాలు, అక్కడ దిక్కులేని చావులకు గురైన సందర్భాలూ ఉన్నాయి. ఆ తర్వాత పాలకులు మారడంతో జిల్లా పరిస్థితుల్లోనూ మార్పులు వచ్చాయి. వరుణుడు కూడా కరుణ చూపడంతో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలన్నీ జలకళను సంతరించుకున్నాయి. హంద్రీ–నీవా, హెచ్చెల్సీ లాంటి నీటి వనరులకూ సమృద్ధిగా జలాలు రావడంతో జీడిపల్లి, పీఏబీఆర్, మిడ్‌పెన్నార్, గొల్లపల్లి, యోగివేమన తదితర రిజర్వాయర్లన్నీ కళకళలాడాయి. పొలాలన్నీ పైరు పంటలతో సస్యశ్యామలంగా మారాయి. ఉద్యాన పంటల సాగులో విప్లవం వచ్చింది. ఏకంగా 2.15 లక్షల హెక్టార్లకు ఉద్యాన పంటలు చేరుకున్నాయి. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకూ తిండి, నీటికొరత తీరింది.

ప్రగతి బాటలు

నేడు పల్లెల్లోనే కాదు..పట్టణాల్లోనూ ప్రగతిబాటలు పరుచుకున్నాయి. పాలన ముంగిటకే వచ్చింది. ప్రతి ఊరు, వీధిలో పౌరసేవలు అందించేందుకు వీలుగా సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఏ సేవ కావాలన్నా ఊరు దాటి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఊళ్లోనే, అదీ మన ఇంటి వద్దకే అన్నీ వచ్చి చేరుతున్నాయి. గతంలో లాగా జన్మభూమి కమిటీల పెత్తనం లేదు. ఏ నాయకుని సిఫారసూ అవసరం లేదు. అర్హత ఉంటే చాలు వెంటనే పథకాలు ఇచ్చేస్తున్నారు. పైగా పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా 'చేయూత' లభిస్తుండడంతో ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి.

ఆస్పత్రి, పాఠశాలలు అన్నీ బాగుపడ్డాయి..

నేడు ఏ ఊరికి వెళ్లినా, ఏ వీధిలో చూసినా అందమైన ప్రభుత్వ భవనాలు, అందులో సత్వర సేవలు, సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాలలు, సకల వసతులు, అవసరమైన సిబ్బంది, అన్ని రకాల మందులతో ఏ క్షణాన్నైనా సేవలందించే ఆస్పత్రులు కన్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాడు–నేడు కింద బాగు చేసిన 3,477 ప్రభుత్వ పాఠశాలల్లో ఏ స్కూలుకు వెళ్లి చూసినా ఆశ్చర్యం కలుగుతోంది. చూడచక్కని భవనాలు, పిల్లలు కూర్చొనేందుకు వీలుగా డెస్కులు, డిజిటల్ బోధనా పరికరాలు, బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు..ఇలా సకల సౌకర్యాలతో ఉన్న పాఠశాలలను చూస్తే 'కార్పొరేటు'కు మించి ఉన్నాయన్న భావన కలుగుతోంది. విదేశాల్లో ఉంటూ అప్పుడప్పుడు సొంతూళ్లకు వచ్చిపోయే వారు సైతం బాగుపడిన స్కూళ్లను చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇది కదా అభివృద్ధి అంటూ కితాబిస్తున్నారు. ఇక ఊరూ వాడ మెరుగుపడిన ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులు ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నాయి. తల్లి కడుపులోని శిశువు మొదలుకుని మంచాన ఉన్న వృద్ధుడి వరకూ..ప్రతిఒక్కరికీ సేవలందిస్తున్నాయి. కరోనా కష్టకాలంలో మూడు దశల్లో 25,47,582 మందికి వైద్యసేవలు అందించారంటే జిల్లాలో వైద్యారోగ్య వ్యవస్థ ఏ స్థాయిలో మెరుగుపడిందో అంచనా వేసుకోవచ్చు. ప్రాథమిక వైద్యం మొదలుకుని 'స్పెషాలిటీ' చికిత్స వరకూ అన్నీ ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి. ఇలా అన్ని రంగాలు, అంశాల్లో మెరుగుపడిన స్థితి నుంచి..'మరింత మంచి' స్థితికి వెళ్లాలన్న ఆకాంక్ష మనందరిలో బలంగా ఉండాలి. మన ఆకాంక్షలు నెరవేర్చగలిగే, మన జిల్లా ప్రగతికి మరింత బాసటనిచ్చే సమర్థులు, విశ్వసనీయత కల్గిన నేతలను ఎన్నుకోవాలి. వంచకులను, ప్రగతినిరోధకులను ఓటు అనే ఆయుధంతో అడ్డుకోవాలి.

నేడు వేతనంతో కూడిన సెలవు

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అనంతపురం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఇతర అన్ని రకాల కార్యాలయాలకు సెలవు ప్రకటించినట్లు వివరించారు. ఆయా సంస్థల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్మికులు, ఉద్యోగులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తమ తమ ప్రాంతాలకు వెళ్లి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సీసీ టీవీల పర్యవేక్షణలో ఎన్నికలు

గుత్తి రూరల్: పోలింగ్ ప్రక్రియ మొత్తం సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, సమస్యాత్మక గ్రామమైన తొండపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తి పని చేయని పక్షంలో వాటి స్థానంలో 20 నిమిషాల్లో మరో ఈవీఎం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని 276 పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను తరలించామన్నారు. డీటీ లలిత పాల్గొన్నారు.

వజ్రకరూరులో పర్యటించిన ఎస్పీ

వజ్రకరూరు: వజ్రకరూరులో ఆదివారం సాయంత్రం ఎస్పీ అమిత్ బర్దర్ పర్యటించారు. స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లు పరిశీలించారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఐ నరేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియురాలు

- తీవ్రంగా గాయపడిన బాధితుడు


తీవ్ర గాయాలతో మోహన్

రాయదుర్గంటౌన్: తనతో కలవడం లేదన్న కోపంతో ఓ మహిళ ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. అతను తీవ్ర కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజీవ్ గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న మేస్త్రీ రమేష్ కుమారుడు మోహన్ తాపీగా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇతను అదే కాలనీకి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. కుటుంబ సభ్యులు మందలించి సదరు మహిళతో కలవకుండా మోహన్‌ను కట్టడి చేశారు. దీంతో ఆమె కోపం పెంచుకుంది. ఆదివారం ఇంటికి వస్తున్న మోహన్‌పై సదరు మహిళ పెట్రోల్ చల్లి నిప్పంటించింది. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. బాధితుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: క్షణికావేశానికి లోనై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం వెంకటాంపల్లికి చెందిన అంజినాయక్‌కు ఏడాదిన్నర క్రితం మంజులాబాయి (20)తో వివాహమైంది. వీరికి 6 నెలల వయసున్న ఓ బాబు ఉన్నాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని అంజినాయక్ పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం చిన్నపాటి విషయాన్ని దంపతులు గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన మంజులాబాయి భర్త బయటకు వెళ్లగానే చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు విషయాన్ని గుర్తించి వెంటనే మంజులాబాయిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'అనంత' రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం మార్పు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో నాల్గో ప్లాట్‌ఫాంను ఆదివారం నుంచి రద్దు చేసినట్లు స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. ధర్మవరం, కదిరి, తిరుపతి, హిందూపురం, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లన్నీ ఇకపై మూడో ప్లాట్‌ఫాంపైకి వస్తాయన్నారు. 2, 3 ప్లాట్‌ఫాంలకు లిఫ్ట్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. అమృత్ పథకంలో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే శాఖ విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నాల్గో ప్లాట్‌ఫాంను పూర్తిగా తొలగించడంతో మార్పు చేయాల్సి వచ్చిందన్నారు. కనీసం 45 రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందన్నారు.


సామగ్రి పంపిణీకి సంబంధించి రికార్డులు సరిచూసుకుంటున్న దృశ్యం


ఈవీఎం, ఇతర సామగ్రితో తరలివెళుతున్న పీఓలు, ఏపీఓలు


ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తీసుకెళుతున్న దృశ్యం


అనంతపురంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సందడి

మేమంతా సిద్ధం... మీదే ఆలస్యం

ఎన్నికల పోలింగ్‌కు అధికారులంతా సిద్ధమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ సామగ్రిని అందుకునేందుకు వచ్చిన ఎన్నికల అధికారులతో అనంతపురం జూనియర్ కళాశాల ప్రాంగణంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం సందడిగా మారింది. సామగ్రిని సరిచూసుకోవడంలో కాస్త గందరగోళం నెలకొన్నా... చివరకు సజావుగా ఈ ప్రక్రియ ముగిసింది. ప్రశాంత ఎన్నికలకు మేమంతా సిద్ధం... ఇక ఓటు వేసే మీదే ఆలస్యమంటూ పీఓలు, ఏపీఓలు తమకు కేటాయించిన బస్సుల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ పోలింగ్ కేంద్రాలకు ప్రయాణమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి


భద్రత నడుమ బస్సుల్లో ప్రయాణానికి సిద్ధమైన ఎన్నికల సిబ్బంది



తమకు కేటాయించిన బస్సు కోసం ఎదురు చూస్తున్న పీఓలు, ఏపీఓలు

పరిశ్రమలకు ఊతం

- నాలుగేళ్లలో జిల్లాలో భారీగా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- ఈ ఏడాదిలోనే 3,600కు పైగా ఏర్పాటైన ఎంఎస్‌ఎంఈలు
- ఒక్క ఏడాదిలో రూ.216 కోట్లకు పైగా పెట్టుబడులతో రికార్డు
- నాలుగేళ్లలో 15 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- నాలుగైదు నెలల్లో మరో 2వేల పరిశ్రమల్లో ఉత్పత్తుల ప్రారంభం


అనంతపురంలోని టీన్ కలర్స్ గార్మెంట్స్‌లో ఉత్పత్తులను ప్యాక్ చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) సోమశేఖర్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో ఎంఎస్‌ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటయ్యాయి. చిన్న పరిశ్రమల రాకతో జిల్లాలో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కాయి. సింగిల్ పోర్టల్ విధానం, సర్కారు ప్రోత్సాహకాలు వెరసి చిన్న పరిశ్రమలు స్థాపనకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనే 3,671 పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు వచ్చారంటే జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

రూ.216 కోట్ల పెట్టుబడులు

2023–24 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం జిల్లాలో 3,671 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీని వల్ల రూ.216.27 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు పరిశ్రమల శాఖ గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి. ఈ పరిశ్రమల్లో 14,174 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. గడిచిన నాలుగేళ్లతో పోల్చుకుంటే ఈ సంఖ్య భారీగా నమోదైనట్టు వెల్లడైంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఆయిల్ మిల్లులు, గృహ వినియోగ వస్తువుల పరిశ్రమలు వంటివి ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దక్కాయి.

తగ్గిన వలసలు

గతంలో అనంతపురం జిల్లా అంటేనే వలసలకు కేంద్ర బిందువుగా ఉండేది. ఇప్పుడా పరిస్థితులు కనుమరుగయ్యాయి. గడిచిన నాలుగేళ్లలో పుష్కలంగా వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది వర్షాభావం నెలకొన్నా... చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుతో వలస పక్షులకు ఊరట లభించింది. 2019కి ముందు ఉన్న పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులకు పూర్తి భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది 14,686 ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు 'ఉద్యం' పోర్టల్‌లో నమోదు చేసుకోగా, ఇప్పటివరకూ 3,671 అమల్లోకి వచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

మారుతున్న పరిస్థితులు

పెట్టుబడిదారుల ఆలోచనల్లో మార్పు వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమే కారణం. సింగిల్‌పోర్టల్ ద్వారా అన్ని అనుమతులూ ఒకేచోట ఇస్తుండటంతో ఇబ్బందులు తొలగాయి. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన పెట్టుబడిదారులు సైతం ఇక్కడికొచ్చి పరిశ్రమలు స్థాపిస్తున్నారు. వారికి కూడా ప్రభుత్వం ప్రోత్సహకాలు, రాయితీలు వర్తింపజేస్తోంది.

సొంతూరిలోనే పరిశ్రమ

అనంతపురానికి చెందిన సోమశేఖర్ బీటెక్ పూర్తి చేసి, ముంబయిలోని మహీంద్ర కంపెనీ (ఆటో మొబైల్)లో ఇంజినీర్‌గా పనిలో చేరారు. అయితే తానే సొంతంగా పరిశ్రమ ఏర్పాటు చేసి పది మందికి ఉపాధి కల్పించాలనే ఆశయంతో 2020లో ఉద్యోగాన్ని వదులుకుని అనంతపురం వచ్చేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమల కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలను పరిశీలించి, తుదకు గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. నగరంలోని పరిశ్రమల శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలను తెలుసుకుని, 'టీన్ కలర్స్' పేరిట గార్మెంట్స్ పరిశ్రమకు దరఖాస్తు చేసుకున్నారు. రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు జారీ కావడంతో రూ.25 లక్షలు పెట్టుబడితో అనంతపుంరలోని సోమనాథ్‌నగర్‌లో పరిశ్రమ ఏర్పాటు చేశారు. చిన్నారులు, మహిళలకు సంబంధించిన అన్నిరకాల దుస్తుల ఉత్పత్తి చేపట్టారు. తొలి రోజుల్లో ఐదుగురు కార్మికులతో ప్రారంభమైన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 25 మంది మహిళా కార్మికులతోపాటు ఐదుగురు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పనిచేస్తున్నారు. పరిశ్రమలోని ఉత్పత్తులను రాయలసీమ జిల్లాలకు ఎగుమతి చేస్తున్నట్లు సోమశేఖర్ తెలిపారు. టర్నోవర్ సైతం బాగుండడంతో యూనిట్ వ్యయంలో 35 శాతం రాయితీ అందించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ లెక్కన రూ.9 లక్షల వరకు రాయితీ అందుతుందన్నారు. ఏపీలో పారిశ్రామిక పాలసీతో పాటు అధికారుల సహకారం బాగుందని కొనియాడారు.

జిల్లాలో 2023-24లో ఎంఎస్‌ఎంఈల పరిస్థితి ఇలా..

నెల	ఎంఎస్‌ఎంఈలు	పెట్టుబడులు	ఉద్యోగాలు
2023 ఏప్రిల్	217	రూ.17.16 కోట్లు	664
2023 మే	237	రూ.15.37 కోట్లు	965
2023 జూన్	322	రూ.17.12 కోట్లు	1,016
2023 జులై	355	రూ.22.50 కోట్లు	1,370
2023 ఆగస్టు	444	రూ.25.17 కోట్లు	1,462
2023 సెప్టెంబర్	399	రూ.17.31 కోట్లు	2,672
2023 అక్టోబర్	366	రూ.17.57 కోట్లు	1,632
2023 నవంబర్	420	రూ.29.41 కోట్లు	1,649
2023 డిసెంబర్	477	రూ.27.29 కోట్లు	1,421
2024 జనవరి	477	రూ.27.37 కోట్లు	1,323

గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో ఎంఎస్‌ఎంఈలు ఇలా..

సంవత్సరం	యూనిట్లు	పెట్టుబడి	ఉద్యోగాలు
2019-20	215	రూ.70.20 కోట్లు	1,509
2020-21	81	రూ.25.46 కోట్లు	571
2021-22	1,302	రూ.107.58 కోట్లు	4,154
2022-23	3,185	రూ.259.85 కోట్లు	10,198

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేను. నేను గార్లదిన్నెలో నాలుగేళ్ల క్రితం బ్యాంకులో రూ.10 లక్షల రుణం తీసుకుని హోమ్ ఫుడ్స్, హెర్బల్ ప్రొడక్ట్స్ కు సంబంధించి చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటు చేశాను. రుణంపై 35 శాతం సబ్సిడీ వచ్చింది. చిరుధాన్యాలతో తయారీ చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, సొంటి, గ్రీన్‌టీ వంటి టీ పొడులను కూడా తయారు చేసి విజయవాడ, కర్నూలు, కడప, అనంతపురం తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నా. మా ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. స్వగ్రామంలోనే పరిశ్రమ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– రాజేశ్వరి, ప్రాణి హోమ్‌ఫుడ్స్/హెర్బల్ ప్రొడక్ట్స్ పరిశ్రమ నిర్వాహకురాలు, గార్లదిన్నె

సొంతూరిలోనే నెలకు రూ.16 వేలు



ఉపాధి కోసం గతంలో తాడిపత్రితో పాటు కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరిగేవాడిని. మండల కేంద్రం పుట్లూరులో ఇటీవలే డ్రిప్ పరిశ్రమ (నేహా ఇండస్ట్రీస్) ఏర్పాటు చేశారు. మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నా. నెలకు రూ.16 వేల వరకు వేతనం అందుతోంది.

– శంకర్, కార్మికుడు, నేహా ఇండస్ట్రీస్, పుట్లూరు

పెట్టుబడిలో 35 శాతం రాయితీ

నగర శివారులోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్‌లో జీఆర్ఎస్ పాలిమర్స్ పేరిట మధ్య తరహా పరిశ్రమ ఏర్పాటుకు నేను దరఖాస్తు చేసుకోగానే నెల రోజుల వ్యవధిలోనే అనుమతులు మంజూరు చేశారు. ప్రత్యక్షంగా 35 మందికి, పరోక్షంగా 20 మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నాం. విద్యుత్ రాయితీ కోసం రూ.2.78 లక్షలతో పాటు వడ్డీ రాయితీ కోసం పరిశ్రమల శాఖ అధికారులు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. యూనిట్ కాస్ట్‌లో 35 శాతం వరకు పెట్టుబడి రాయితీని అందనుంది.

– నాగేశ్వర్‌గౌడ్, జీఆర్ఎస్ పాలిమర్స్ నిర్వాహకుడు, అనంతపురం

200 మీటర్ల పరిధిలో నో ఎంట్రీ

అనంతపురం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలో ఏ పార్టీ అభ్యర్థినీ అనుమతించమన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్ ఉన్న ప్రాంతంలో 2,3 పోలింగ్ బూత్‌లు ఉన్నప్పటికీ మొత్తం 200 మీటర్ల పరిధిని పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ నియమించిన చేసిన పరిశీలకులు, ఇతర అధికారులు, పోలీసులకు మాత్రమే సెల్‌ఫోన్లు ఉపయోగించడానికి 100 మీటర్ల పరిధి వరకు అనుమతి ఉంటుందన్నారు.

- ఒక్కో అభ్యర్థికి ఒక వాహనం, ఎన్నికల ఏజెంటు గానీ వర్కర్లు గానీ డ్రైవర్ సహా ఐదుగురి మాత్రమే ఆ వాహనంలో ప్రయాణించడానికి అనుమతి ఉంటుంది. ఓటర్లను తరలించడం చట్టరీత్యా నేరం.
- జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను వాహనం ముందు భాగంలో అతికించుకోవాలి.
- ఓటర్లను తరలించేందుకు ఉచిత ప్రయాణ వసతులు కల్పించడం నేరం.
- అనుమతించిన సెక్యూరిటీ అధికారులకు మాత్రమే 100 మీటర్ల పరిధిలోకి వచ్చేందుకు అనుమతి.
- పోలింగ్ లొకేషన్ పరిసరాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌లు అమలు.
- సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషిద్ధం. గుంపులుగా, ఐదుగురు కంటే ఎక్కువగా గుమికూడితే చట్టపరంగా చర్యలు.



- ఓటరు కాని వారు పోలింగ్ రోజున ఆ గ్రామాల్లో ఉండకూడదు.
- పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్లలోపు ఎలాంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలు, టెంట్లు నిర్వహించరాదు.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు.
- నీళ్ల బాటిళ్లు, ఇంకు సీసాలు, బాల్‌పెన్నులు, మొబైల్ ఫోన్లు, తదితర విలువైన వస్తువులేవీ పోలింగ్ కేంద్రాలోకి అనుమతి లేదు.
- ప్రజలు ఆయుధాలు, తుపాకులు, పదునైన వెపన్లు, లాఠీలు, కర్రలు , రాళ్లు వంటివి వెంట తీసుకెళ్లడం, ప్రదర్శించడం నిషిద్ధం.
- అభ్యర్థి గన్‌మెన్లు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లరాదు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే ఆగిపోవాలి.
- ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్.

స్టాఫ్‌నర్సుల సేవలు భేష్

- డిప్యూటీ సూపరింటెండెంట్ ఆత్మారాం, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని

అనంతపురం కార్పొరేషన్: కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో స్టాఫ్‌నర్సులు అందించిన సేవలు అనన్యమని జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని కొనియాడారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లెక్చరర్స్ గ్యాలరీలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి డిప్యూటీ సూపరింటెండెంట్, డిప్యూటీ ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోవిడ్ సమయంలో రోగులకు వైద్యులు చికిత్స నందించిన అనంతరం వారిని కంటికి రెప్పలా కాపాడింది స్టాఫ్‌నర్సులేనన్నారు. కోవిడ్‌తో కుటుంబీకులు ఇబ్బందులు పడుతారని తెలిసినా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా స్టాఫ్‌నర్సులు సేవలందించారన్నారు. దీంతో అనంతపురం స్టాఫ్‌నర్సులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత సేవలందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్, ఇందిరాగాంధీ, కిరణ్‌బేడీ, సరోజిని నాయుడు తదితరుల వేషధారణలో పలువురు నర్సులు ఆకట్టుకున్నారు. అనంతరం ఓ నర్సు యోగతో కలిగే ప్రయోజనాలను పాట పాడుతూ ఆసనాలు వేసి చూపించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్ఎంఓ సునీత, హెడ్‌నర్సులు సైరాభాను, రాజన్‌లత, ఆదిలక్ష్మి, భానురేఖ, ఆశాలత, భానులత, ఐసీఎన్‌లు శోభ, ప్రసన్న, స్టాఫ్ నర్సు అసోసియేషన్ ఆర్‌బీ పద్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ హేమలత, రజిని తదితరులు

ప్రశాంత గుంతకల్లుకే ఓటు

- సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీకి శ్రీ రామరక్ష
- ఆరాచకవాదీగా ముద్ర పడిన గుమ్మనూరు జయరాం
- వీవైఆర్ విజయం లాంఛనమే అంటున్న విశ్లేషకులు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి



గుంతకల్లులో అర్బన్ హెల్త్ సెంటర్



గుంతకల్లు మండలం ఎస్.తిమ్మాపురంలో నాడు-నేడు కింద అభివృద్ధి పరిచిన ప్రాథమిక పాఠశాల

గుంతకల్లు: రాజకీయంగా చైతన్యం కలిగిన నియోజకవర్గాల్లో ఒకటిగా నిలిచే గుంతకల్లులో వైఎస్సార్ సీపీలో గెలుపు జోరు స్పష్టంగా కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిపోయిన గుమ్మనూరు జయరాం ఆరాచక వాదిగా ముద్ర వేసుకోవడంతోపాటు టీడీపీ నాయకుల మధ్య సఖ్యత లేక సైకిల్ స్పీడుకు బ్రేకులు పడి ఎన్నికల రణ రంగంలో వెనుకబడినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పట్టణాభివృద్ధితోపాటు ఆయన చేసిన సేవ కార్యక్రమాలే విజయ సోపానంగా నిలుస్తున్నాయి.

ఎన్నడూ లేని అభివృద్ధి

నియోజకవర్గంలో ఎన్నడు లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సేవ కార్యక్రమాలు చేస్తుండడం వైఎస్సార్‌సీపీకి విజయానికి శ్రీరామ రక్ష నిలుస్తుందని ప్రజల అభిప్రాయపడుతన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వైవీఆర్ గత ఐదేళ్లలో చేసిన పాలన చూసి టీడీపీ నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గుంతకల్లు నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.3వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. అలాగే వివిధ పథకాల ద్వారా రూ.3,500 కోట్లకు పైగా లబ్ధిదారులకు నేరుగా చేరింది. అంతేకాకుండా దశాబ్దాలుగా ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి పనులను జగనన్న సారథ్యంలో వైవీఆర్ చేసి చూపించారు. అందులో బ్లడ్ బ్యాంకు, డయాలిసిస్ సెంటర్‌తోపాటు దాదాపు రూ.25 కోట్లతో నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రులను నాడు-నేడు కింద అభివృద్ధి చేశారు. దాదపు మూడు దశాబ్దాల విద్యార్థుల కలగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడంతోపాటు కళాశాల ఏర్పాటుకు రూ.34.74 కోట్లు మంజూరు చేయడం, ఆర్‌డీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, గుంతకల్లు, గుత్తి పట్టణాల్లో దాదపు రూ.1.70 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి తోడు నాడు-నేడు కింద పాఠశాలలు అభివృద్ధి పరిచి కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించారు.

వైవీఆర్ సేవలు భేష్..

ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డి నిత్యం ప్రజాశ్రేయస్సుకే అంకితం అయ్యారు. ప్రభుత్వాస్పత్రి సమీపంలో వైఎస్సార్-వైవీఆర్ క్యాంటీన్ ఏర్పాటు చేసి రూ.6కే నాణ్యమైన భోజనాన్ని అందజేశారు. దాదాపు రెండేళ్ల పాటు సాగిన ఈ కార్యక్రమం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రస్తుతం నిలిచిపోయింది. అంతేకాకుండా కరోనా సమయంలో పట్టణంలో ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు, కూరగాయాలు అందజేశారు. అదేవిధంగా రెండు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి అత్యవసర సేవలు అవసరమైన రోగులకు అనంతపురం, కర్నూలు తదితర పట్టణాలకు ఉచితంగా తరలిస్తుంటారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు				
మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గుంతకల్లురూరల్	19,509	19,225	03	38,737
గుంతకల్లు అర్బన్	54,272	58,208	52	1,12,532
గుత్తిరూరల్	16,256	16,173	01	32,430
గుత్తి అర్బన్	18,810	19,838	13	38,661
పామిడి	23,964	24,051	06	48,021
	1,32,811	1,37,495	75	2,70,381

గుమ్మనూరు జయరాంపై ఆరాచక ముద్ర

టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న గుమ్మనూరు జయరాంపై అది నుంచే ఆరాచక వాదిగా ముద్ర పడింది. దీనికి తోడు జయరాం నాన్ లోకల్ కావడం వైవీఆర్ విజయంలో ఏ మాత్రం సందేహం లేదు. గుమ్మనూరు జయరాం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో ఆయన చేసిన ఆరాచకలు గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు. ఆయన, ఆయన సోదరులు చేసిన భూదందా, పంచాయితీలుతోపాటు పేకాట స్థావరాలు నడపడం, కర్ణాటక మద్యం సరఫరా చేసి ప్రతి వీధిలో బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించారు. అంతేకాకుండా ప్రతి పనికీ ఓ రేటును ఫిక్స్ చేసి వసూళ్ల చేయడం, ఆలయ భూములను వారి ఆధీనంలోనే ఉంచుకోవడం, ఆలయాల్లో వచ్చే ఆదాయంలో వీరికి కప్పం వసూళ్ల చేయడం, ఇలా ఆలూరు నియోజకవర్గం అభివృద్ధిని పక్కన పెట్టి స్వలాభం కోసమే పాటుపడారు. దీంతో ఆయనను ఆలూరుకు సాగనంపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. గుంతకల్లును ప్రశాంతంగా ఉంచుకునేందుకు ప్రజలు ఓటును ఆయుధంగా వాడనున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డిని గెలిపించి, గుంతకల్లును కాపాడుకుంటామని పేర్కొంటున్నారు.

ఉరవకొండ.. ఎవరికి అండ

- జగనన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో సానుకూలత
- రూ. 2,500 కోట్ల సంక్షేమ, మరో వెయ్యికోట్లతో అభివృద్ధి
- గెలుపు దిశగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి !
- టీడీపీ అభ్యర్థి కేశవ్‌కు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ (ఫైల్)

ఉరవకొండ: ఉరవకొండపై సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పాగా వేయనుంది. సంక్షేమ పాలనలో ప్రతి గడపకూ పథకాల ఫలాలు అందాయి. దీనికితోడు ప్రజల మనిషిగా, నిత్యం ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే నాయకుడిగా విశ్వేశ్వరరెడ్డికి గుర్తింపు ఉంది. దీనికితోడు పార్టీలకతీతంగా పథకాల లబ్ధి చేకూడంతో ప్రజలు కూడా ఈసార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టనున్నారు. ఎప్పటి నుంచో ఉన్న ఇక్కడి సెంటిమెంట్‌ను వైఎస్సార్‌సీపీ బద్దలు కొట్టనుంది. విశ్వేశ్వరరెడ్డి గత ఎన్నికల్లో గెలవకపోయినా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రతి గడపకూ తిరిగి, సంక్షేమ పాలన, పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రచారంలోనూ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. విశ్వ సతీమణి భువనేశ్వరి, తనయుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం విస్తృతంగా చేశారు. దీంతో ప్రజలు కూడా ఫ్యాన్‌కే పట్టం కట్టనున్నారని అభిప్రాయ పడుతున్నారు.

మంచి మనసున్న నాయకుడు విశ్వ:

ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మనసున్న నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పేదలు, బడుగుబలహీన వర్గాలతో పాటు రైతుల పక్షపాతిగా విశ్వేశ్వరరెడ్డికి మంచిపేరు ఉంది. జిల్లాలోనే పోరాటాల యోధుడిగా అత్యంత సౌమ్యుడిగా విశ్వేశ్వరరెడ్డిని పిలుస్తారు. అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా ఐదేళ్ల పాటు నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు అందేలా చేసి, నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఐదేళ్ల పాలనలో రూ. 2,500 కోట్లతో సంక్షేమ పథకాల ద్వారా, మరో వెయ్యి కోట్లు అభివృద్ధి పథకాల ద్వారా ఖర్చు పెట్టి పేదల సంక్షేమానికి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి పెద్దపీట వేశారు. దీంతో పాటు రికార్డు స్థాయిలో నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు, ఒక్క ఉరవకొండ పట్టణంలోనే 3 వేల మందికి ఇంటి పట్టాలు, పక్కా ఇళ్లు నిర్మించేలా కృషి చేశారు. ఐదేళ్లలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5 కోట్లు ప్రజలకు అందేలా చూశారు. ఉరవకొండలో సీసీరోడ్లు నిర్మాణానికి రూ.10కోట్లు, మరో 23 గ్రామాలకు రోడ్లు నిర్మించారు. ఉరవకొండ పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటిని పరిష్కరించేందుకు ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్‌ను రూ.15 కోట్లతో మంజూరు చేయించారు.

చేనేతల సంక్షేమానికి కృషి :

చేనేత కార్మికుల్లో మరింత నైపుణ్యం పెంచేందుకు విశ్వ కృషి ఫలితంగా రూ.3.50 కోట్లతో రెండు చేనేత బ్లాక్‌లెవెల్ క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ, మసీదుల్లో మౌలిక వసతులు, వాటి మరమ్మతుల కోసం నిధులు కేటాయించేలా కృషి చేశారు. బెళుగుప్ప మండలం జీడిపల్లికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.82 కోట్లు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా మొదటిదశ సాగునీటి కాలువ నిర్మాణం కోసం రూ.68 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. వజ్రకరూరు మండలం రాగులపాడు ఎత్తిపోతుల పథకానికి రూ.20 కోట్లు మంజూరు, గిరిజన తండాల్లో అటవీభూములు సాగుచేస్తున్న గిరిజన రైతులకు సాగుపట్టాలు పంపిణీ చేయించిన ఘనత విశ్వేశ్వరరెడ్డికే దక్కుతుంది.విడపనకల్లు మండలంలో 15వేల ఎకరాల్లో సాగులో ఉన్న మిర్చి పంటను కాపాడటానికి హంద్రీనీవా నీటిని జీబీసీకి మళ్లించి, దాదాపు రూ.350 కోట్ల పంట కాపాడారు.

పార్ట్ టైం ఎమ్మెల్యే కేశవ్ :

ఉరవకొండ టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఎమ్మెల్యేగా గెలిచినా ప్రజా సమస్యలు ఏనాడూ పట్టించకోలేదు. ప్రజలకు దూరంగా, నగరాల్లోనే ఉండేవారు. సొంత వ్యాపారాలు చూసుకుంటూ ఉండేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలూ ఉన్నాయి. తీరా ఎన్నికలకు రెండు నెలల సమయం ఉందనగా ప్రజల్లోకి వచ్చారు. దీంతో ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కేశవ్ పూర్తిగా వెనుకబడి డీలా పడినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- గుంతకల్లు అసెంబ్లీలో 276 పోలింగ్ కేంద్రాలు
- తరలిన ఈవీఎం, వీవీప్యాట్ మిషన్లు
- నేడు పోలింగ్



గుంతకల్లు: స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు తీసుకొస్తున్న దృశ్యం

గుంతకల్లు: గుంతకల్లు అసెంబ్లీకి సంబంధించిన ఏర్పాటు పూర్తయ్యాయి. నియోజకవర్గంలోని మొత్తం 276 కేంద్రాల్లో పోలింగ్‌కు సిద్ధం చేసినట్లు ఆర్వో శ్రీనివాసురెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన సిబ్బందికి ఎన్నికల సామాగ్రి అందజేశారు. సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వారీగా పీఓలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లు ఇతర సామాగ్రి అప్పగించారు. సామాగ్రి తీసుకున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలు కేటాయించిన వాహనాల్లో కేంద్రాలకు చేరుకున్నారు. మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం సోమవారం ఉదయం 7.00 గంటలను పోలింగ్ ప్రారంభించనున్నారు.

విధుల్లో 1979 సిబ్బంది..

ఎన్నికల విధుల్లో దాదాపు 1979 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు ఆర్వో తెలిపారు. అందులో పీఓలు 319 మంది, ఏపీఓలు 332, ఓపీఓలు 1328 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా మైక్రో అబ్జర్వర్లు 62, వెబ్ కాస్టింగ్ సిబ్బంది 35 విధులు నిర్వహిస్తున్నారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుదని, దాదాపు 300 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శివభాస్కరరెడ్డి తెలిపారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని గొందిపల్లి, తొండపాడు, జక్కలచెరువుతో పాటుగా పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ పరిశీలించారు. మండలంలో మొత్తం 79 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్‌లలో పీఓ, ఏపీఓ, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్‌లను నియమించామన్నారు. మండల వ్యాప్తంగా 9 రూట్లకు తొమ్మిది మంది రూట్ అధికారులు, తొమ్మిది మంది జోనల్ అధికారులను ఉంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది అబ్దుల్ పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలో సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్ కు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 37 పోలింగ్ బూత్‌లు, రూరల్‌లో 39 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పామిడి: సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన మొత్తం 52 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు సారథ్యంలో పోలీసులు, స్పెషల్‌పార్టీ పోలీసులు బందోబస్తు చేపట్టారు.



గుంతకల్లు: సామాగ్రి సర్దుసుకుంటున్న పీఓ, ఏపీఓలు

ఎన్నికలు సజావుగా నిర్వహిద్దాం

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పీఎస్ ఆవరణలో గుంతకల్లు నియోజకవర్గంలో పోలింగ్ బందోబస్తు విధులకెళ్తున్న సెక్టార్ పోలీసు అధికారులు, రూట్ ఆఫీసర్లు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులంతా ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రిసైడింగ్ అధికారుల అనుమతి మేరకు నడుచుకోవాలన్నారు. రూట్ మొబైల్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తులో ఉండే సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లకు దిశానిర్దేశం చేశారు. పీఎస్‌ల వద్ద ఉదయం 6 గంటల పోలింగ్ మొదలు రాత్రి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే దాకా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గుంతకల్లు, గుత్తి, పామిడి సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేష్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం ఆటోలో నుంచి జారి కింద పడి శ్రీరామ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. ప్యాపిలికి చెందిన శ్రీరామ్ ఆటోలో వెనుక భాగంలో కూర్చొని గుత్తికి వస్తుండగా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జారి కింద పడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పండగ వాతావరణం



బెళుగుప్ప మండలం నక్కలపల్లి పోలింగ్ కేంద్రం వద్ద రంగవల్లులు వేసిన దృశ్యం



బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద రంగవల్లులు వేసి పచ్చతోరణాలతో పండుగ వాతావరణం మధ్య పోలింగ్ జరిగేలా అధికారులు సర్వం ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 36,896 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు పోలింగ్ సిబ్బంది, నలుగురు సహాయక సిబ్బంది చొప్పున మొత్తం 430 మంది పోలింగ్ అధికారులు ఆదివారం మండలానికి చేరుకున్నట్లు తహసీల్దార్ హరినాథ్‌రావు తెలిపారు. మండలంలో బెళుగుప్ప, వెంకటాద్రిపల్లి, కోనంపల్లి, తగ్గుపర్తి పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, 80 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి



శంకరమఠంలో పూజలందుకున్న ఆదిశంకరుడు

అనంతపురం కల్చరల్: నగరములోని శంకర మఠాల్లో ఆదివారం శంకర జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష అలంకార సహిత పూజలు, నగరోత్సవాలు, పల్లకీ సేవలు ఘనంగా జరిగాయి. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని శంకరమఠంలో జగద్గురువు ఆది శంకరుల జయంత్యుత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో నగర వీధుల్లో జగద్గురువుల ఉత్సవ విగ్రహాలను భక్తజన సంకీర్తనల నడుమ ఊరేగించారు. మధ్యాహ్నం నారాయణ సేవ (అన్న సంతర్పణ) కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశీకులు రామసుబ్రహ్మణ్యం , ఉపనయన సేవా సమితి నిర్వాహకులు సాయి శివరాం, రఘు, రాఘవేంద్ర జోషి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగర శివారులోని శృంగేరి శారదా శంకర మఠంలో శంకర జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివస్వరూపులైన శంకరాచార్యులు, శారదామాతను సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఇన్‌చార్జి మేనేజర్ సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయ పరిసరాలలో అమ్మవారిని ఊరేగించారు. తపోవనంలోని వేదమాత గాయత్రి దేవి ఆలయంలో శంకర జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. స్వామికి రుద్రాభిషేకాలు, శతనామార్చన, తీర్థప్రసాద వినియోగం ఘనంగా జరిగాయి.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన సిబ్బంది

- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- 2,800 మంది పోలింగ్ సిబ్బంది, మరో 1,200 మంది పోలీసు సిబ్బంది
- సమస్యాత్మక గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన జేసీ కేతన్‌గార్గ్

ఉరవకొండ: ఉరవకొండ – 149 అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 2,24,339 మంది ఓటర్లు ఉండగా, 263 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 150 సమస్యాత్మక కేంద్రాలను అధికారులు గుర్తించి, ప్రతి కేంద్రంలో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్‌ను పర్యవేక్షించనున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 32 సెక్టార్లకు 22 కౌంటర్లు ఏర్పాటు చేసి, ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. సామగ్రిని పీఓ, ఏపీఓ, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. సిబ్బందికి ఈవీఎంలతో పాటు ఇతర మెటీరియల్ అందించారు. ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు కోసం 1,200 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆయా మండలాలకు వెళ్లడానికి 87 బస్సులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటరు స్లిప్‌లతో పాటు ఏదైన గుర్తింపు కార్డు తప్పకుండా తీసుకొచ్చి, ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

కూడేరు: సార్వత్రిక ఎన్నిలకు సంబంధించి ఓటింగ్ సోమవారం జరగనుంది. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రత్న రాధిక ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 32,285 మంది ఓటర్లుండగా, అందులో పురుషులు 16,009, మహిళలు 16,269 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నట్లు ఆమె తెలిపారు.మొత్తం 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, కేంద్రాల వద్ద బారికేడ్లు, నీడ వసతి కోసం షామియానాలు ఏర్పాటు చేయించినట్లు ఆమె తెలిపారు.ఏ పోలింగ్ కేంద్రం వద్ద గొడవలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.



ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కూడేరు: పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు సిద్ధం చేస్తున్న అధికారులు



సామగ్రితో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు తరలివెళ్తున్న సిబ్బంది

భక్తిశ్రద్ధలతో ఆరాధన



పూజలందుకున్న జయలక్ష్మీ మాత

రాప్తాడు /అనంతపురం కల్చరల్: దైవాంశస్వరూపురాలిగా పూజలందుకుంటున్న జయలక్ష్మీ మాత జయంతి ఆదివారం కన్నులపండువగా జరిగింది. రాప్తాడు మండల కేంద్రంలోని బొమ్మేపర్తి గ్రామం భక్త జనసంద్రంగా మారింది. ఆశ్రమ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు చిదంబర శాస్త్రి, అమరసింహ నేతృత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చండీ హోమం, పంచామృతాభిషేకం, పంచ హారతులు, అన్నదానం జరిగాయి. స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ట చేసిన వివిధ దేవతామూర్తుల అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈసారి శంకర జయంతి, మాతృదినోత్సవం కలిసి రావడం విశేషమన్నారు. తల్లి ప్రాధాన్యత, క్రమశిక్షణతో కూడిన జీవితం లభ్యమయ్యే తీరు గురించి పురాణేతిహాసాల్లోని ఘట్టాలను వివరించారు. అనంతరం దివ్యనామ సంకీర్తన వీనులవిందుగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాటూ ఆశ్రమ నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.